జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com


# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com




## జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గార్కి జన్మదిన శుభాకాంక్షలు









జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 02-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 772 పేజీలు: 4 వెల: రూ.7

# కాశీబుగ్గ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై..

# అవినీతి ఆరోపణలు



* మధ్యవర్తుల ద్వారా ముడుపులు వసూలు
* కాసులు చెల్లించనిదే ముందుకుసాగని డాక్యుమెంట్లు
* డాక్యుమెంట్ రైటర్లే అక్కడ కీలకం
* వారు చెబితేనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ
* సమగ్ర విచారణకు డిమాండ్




పలాస, సెప్టెంబర్ 1 (వార్త): ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించాల్సిన కాశీబుగ్గ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారిక రుసుములు చెల్లించినా అదనంగా డబ్బులు ఇవ్వకపోతే పనులు ముందుకు సాగడం లేదని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. "ఏ పని.. ఎంత ఇస్తారు?" అన్న చర్చతోనే వ్యవహారం మొదలవుతోందని బాధితులు వాపోతున్నారు. రిజిస్ట్రేషన్, గ్రామకంఠం భూముల వ్యవహారాలు, వివిధ ధ్రువపత్రాల జారీ వంటి అంశాల్లో అనధికారికంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ అదనపు చెల్లింపులు చేయకపోతే ఫైళ్లలో అభ్యంతరాలు చూపుతున్నారని కొందరు బాధితులు వాపోతున్నారు. ఫైళ్లను రోజుల తరబడి పెండింగ్‌లో ఉంచి చివరకు మధ్యవర్తుల ద్వారా 'సెటిల్‌మెంట్' చేయిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. గ్రామాల్లో నివాస స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ కోసం వచ్చే సాధారణ ప్రజలు ఈ పరిస్థితులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూమి విలువతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఈ మొత్తం చెల్లించాల్సిందేనన్న రీతిలో వ్యవహారం సాగుతోందని కొందరు బాధితులు ఆరోపిస్తున్నారు. చిన్న స్థలం కొనుగోలు కోసం అప్పులు చేసి డబ్బులు సమకూర్చుకున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు రిజిస్ట్రేషన్ సమయంలో అదనపు భారం పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సర్టిఫికెట్ ఉంటే ఒక రేటు.. లేకపోతే మరో రేటు?గ్రామకంఠం సర్టిఫికెట్ల విషయంలోనూ 'రేటు కార్డు' తరహాలో వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. సర్టిఫికెట్ ఉంటే ఒక మొత్తం.. లేకపోతే మరో మొత్తం అంటూ డబ్బులు అడుగుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏసీబీకి పట్టుబడకుండా ఉండేందుకే నేరుగా కాకుండా మధ్యవర్తుల ద్వారా వ్యవహారాలు నడుపుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. కార్యాలయంలో గతంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) తనిఖీలు, దాడులు జరిగినా కొందరు సిబ్బంది తీరులో మార్పు అయితే రాలేదు. డాక్యుమెంట్ రైటర్లే అక్కడ కీలకంగా వ్యవహరిస్తున్నారు. వారు చెబితేనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముందుకుసాగుతుంది. కలెక్షన్లు అంతా వారి కనుసన్నల్లోనే జరుగుతోంది. వారు చెప్పిందే వేదం అన్నట్టుగా సాగుతోంది.

## సమగ్ర విచారణకు డిమాండ్

కాశీబుగ్గ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై వస్తున్న అవినీతి ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించాలని, అవినీతి విరోధిక శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని ప్రజలు అంటున్నారు. కార్యాలయంలోని రిజిస్ట్రేషన్ ప్రక్రియ, పెండింగ్ ఫైళ్లు, సర్టిఫికెట్ల జారీ, మధ్యవర్తుల పాత్ర తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ ఉంది.

# రాకాసి అల.. మింగేసింది!



* తెప్పను ఢీకొన్న భారీ కెరటం
* నడిసంద్రంలో తెప్ప బోల్తా
* ఓ మత్స్యకారుడి మృతి
* బతికిబయటపడిన మరో ముగ్గురు
* గెడ్డవూరులో విషాదం

మందస, సెప్టెంబరు 1(వార్త):కడలినే నమ్ముకుని బతుకుతున్న మత్స్యకారులు తరచూ సముద్రంలోనే మరణిస్తున్నారు. జీవనాధారమైన చేపలవేట వారి ప్రాణాలకు శాపంగా మారుతోంది. పలాస నియోజకవర్గంలోని మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లో ఇటీవల జరుగుతున్న సంఘటలను మత్స్యకార కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపుతున్నాయి. ఇటీవల మందస, వజ్రపుకొత్తూరు మండలాలకు చెందిన పలువురు మత్స్యకారులు చేపలవేటకు సముద్రంలోకి వెళ్లి, రాకాసి అలలకు బలయ్యారు. మందస మండలంలోని దున్నవూరు పంచాయతీ గెడ్డవూరు గ్రామంలో మంగళవారం విషాద సంఘటన చోటు చేసుకుంది. ఎప్పటిలాగానే సముద్రంలోకి గెడ్డవూరు గ్రామానికి చెందిన నలుగురు మత్స్యకారులు వంక యాదవరావు(52), వంక భీమారావు, వంక ధర్మారావు, కోడ కూర్మారావు చేపల వేట కోసం తెప్పపై సముద్రంలోకి వెళ్లారు. సముద్రంలో చేపలు పడుతున్నారు. ఇదే సమయంలో ఓ పెద్ద రాకాసి అలలు తెప్పను బలంగా ఢీకొంది. దీంతో తెప్ప బోల్తా పడిపోయింది. నలుగురు మత్స్యకారులు సముద్రంలో పడిపోయారు. ప్రాణభయంతో ఈదుకుంటూ ఒడ్డుకు రావడానికి ప్రయత్నించారు. భీమారావు, ధర్మారావు, కూర్మారావు ముగ్గురు ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని, ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. కానీ, మరో మత్స్యకారుడు వంక యాదవరావు కనిపించలేదు. అప్పటికే వారి మనసులో కీడు శంకించగా.. వారు అనుకున్నట్టే జరిగింది. తెప్ప కింద యాదవరావు ఉండిపోవడంతో ఆయన బయటకు రాలేకపోయాడు. గ్రామస్తుల సహకారంతో యాదవరావును ఒడ్డుకు తీసుకువచ్చారు. అప్పటికే ఆయన అచేతనంగా ఉండిపోవడంతో కొంతమంది సీపీఆర్ చేశారు. అయినా చలనంలేదు. అప్పటికే మందస 108వాహనానికి సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని, ప్రాథమిక చికిత్స చేశారు. అయినా దేవుడు కరుణించలేదు. అప్పటికే యాదవరావు మరణించినట్టు గుర్తించారు. కాగా.. ఎంతో శ్రమించి ఒడ్డుకు చేరుకున్న భీమారావు, ధర్మారావు, కూర్మారావు మృత్యుంజయులుగా మారినప్పటికీ తోటి మత్స్యకారుడు కళ్లదుటే మరణించడానికి వారు జీర్ణించుకోలేకపోతున్నారు. కన్నీటి పర్యవంతమయ్యారు. ఇదిలా ఉండగా.. మరణించిన యాదవరావు సోదరుడే భీమారావు. యాదవరావు మృతితో ఆయన కుటుంబం కన్నీరు, మున్నీరుగా విలపిస్తోంది. కుటుంబ పోషకుడు మరణించడంతో ఎలా బతికేదని విలపిస్తున్నారు. యాదవరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మందస మండలంలోని హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నేడు పవన్ కళ్యాణ్

# జన్మదిన వేడుకలు

* జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు
* నగరంలో బైక్ ర్యాలీ
* యువజన విభాగం లోగో ఆవిష్కరణ
* ఫ్లెక్సీలు, బ్యానర్లతో నిండిన జిల్లా



శ్రీకాకుళం, సెప్టెంబర్ 1 (వార్త): జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి, మంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించేందుకు పార్టీ శ్రేణులతో పాటు పవర్‌స్టార్ అభిమానులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం నగరంలోని శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలిలోని ఎన్‌టీఆర్ మున్సిపల్ మైదానంలో ఉదయం తొమ్మిది గంటలకు భారీ బైక్ ర్యాలీ చేయనున్నారు. ఈ ర్యాలీ సూర్యమహల్ జంక్షన్, ఉమెన్స్ కళాశాల మీదుగా 80 అడుగుల రోడ్డులోని ఆనందమయి ఫంక్షన్ హాల్ వరకూ చేరుకుంటుంది. పదిన్నర గంటలకు జనసేనపార్టీ యువజన విభాగం లోగో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. అలాగే రక్తదాన, వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. సుడా ఛైర్మన్ కొరికాన రవికుమార్, జనసేనపార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యదర్శి పిసిని చంద్రమోహన్, శ్రీకాకుళం నియోజక వర్గం ఇంచార్జి కోరాడ సర్వేశ్వరరావు తదితర ముఖ్య నాయకులు పాల్గొంటారని సాగర మత్స్యకార సొసైటీ వైస్ ప్రెసిడెంట్. గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎంపీటీసీ అభ్యర్థి బడి శ్రీరాములు తెలిపారు. బందరు వానిపేట గ్రామ జనసైనికులు, వీరమహిళలు, నాయకులందరూ పెద్ద ఎత్తున తరలివస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఆదివాసీ మహిళలకు రక్షణ కల్పించాలి

- ఊకే శిరీష హత్య ఘటనపై ఆగ్రహం
- నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
-బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం.. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ




### పలాసలో భారీ ర్యాలీ

**పలాస, సెప్టెంబరు 1(వార్త):** ఆదివాసీ మహిళలకు భద్రత కల్పించాలని, ఊకే శిరీష హత్య ఘటనలో నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎఐఎఈఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం పలాస-కాశీబుగ్గ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఆదివాసీ ఉద్యోగులు, మహిళలు, బాలబాలికలు ర్యాలీలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. ఊకే శిరీష హత్య, అత్యాచార ఘటన తమను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని కోరారు.

### నాలుగు ప్రధాన డిమాండ్లు

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని ఎఐఎఈఎఫ్ ప్రతినిధులు కోరారు.

నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.

కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా అందించాలి.

ఆదివాసీ మహిళల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఆదివాసీ మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం మరింత బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని నాయకులు తెలిపారు. మహిళలపై నేరాలను అరికట్టేందుకు చట్టాల అమలుతో పాటు, బాధితులకు తక్షణ న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఎఐఎఈఎఫ్ సభ్యులు స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించడంతో పాటు, ఆదివాసీ మహిళల భద్రతకు ప్రభుత్వం స్పష్టమైన చర్యలు ప్రకటించాలని వారు కోరారు.

### భారీగా పాల్గొన్న ఆదివాసీలు

ఈ ర్యాలీలో ఎఐఎఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ సవర జగన్నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సవర రామారావు, పలాస మండల అధ్యక్షుడు పి.ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సవర చంద్రశేఖర్, హెచ్డబ్ల్యూఓలు సునీత, భాస్కరరావుతో పాటు పలువురు ప్రతినిధులు, ఉద్యోగులు, బాల, బాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదివాసీ నాయకుల అక్రమ అరెస్టులు అన్యాయం

- కూటమి ప్రభుత్వంపై ఆదివాసీ నాయకుడు నీలకంఠం ధ్వజం



**మందస, సెప్టెంబరు 1(వార్త):** ఆదివాసీలపై కూటమి ప్రభుత్వం ద్వేషం చూపుతోందని గిరిజన ఐక్యవేదిక అధ్యక్షుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పలాస నియోజకవర్గం ఎస్టీ విభాగ అధ్యక్షుడు సవర నీలకంఠం(బిట్టుబాబు) అన్నారు. మందసలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విశాఖపట్నంలోని మారికవలస గురుకులం "స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ" విద్యార్థుల భవిష్యత్తుతో రాష్ట్ర కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని కూటమి ప్రభుత్వం సమస్యలపై నిలదీసిన ఎమ్మెల్సీ కుంభ రవిబాబు, మరి కొంతమంది మాజీ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఒక ప్రజాప్రతినిధి విద్యార్థుల తరపున మాట్లాడటం నేరమా అని ప్రశ్నించారు. దీక్షలకు వెళ్లిన నాయకులను పోలీసులు అడ్డుకోవడం చాలా బాధాకరమన్నరు. ఆదివాసీ ఉద్యమ నాయకులు అక్రమంగా గృహనిర్బంధాలు అరెస్టులు చేయడం దారుణమన్నారు. గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజా సంఘాలు అదే విధంగా వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ పోరాటాల ఫలితంగా ఆగస్టు 28న అర్ధరాత్రి కొనసాగిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని పాడేరు నుంచి విద్యార్థులు బస్సులు తిరిగి విశాఖకు తరలించాలని తెలిపారు. విశాఖకు చేరిన విద్యార్థులకు సరైన వసతి భోజనం కల్పించకుండా కేవలం రెండు చిన్న గదుల్లో ఉంచి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివాసి సంఘాలు అక్రమ అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్ కి తరలిస్తున్నారు. గృహ నిర్భందం చేస్తున్నారు.. ఇటువంటి చర్యలు తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలపై అడిగే హక్కు ప్రతి ఒక్క పౌరుడికి ఉంటుందన్నారు. ఈ అక్రమ నిర్బంధాలను ప్రజలందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. తక్షణమే మారికవలస గురుకులం "స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీ"ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా యధావిధిగా కొనసాగించాలని, లేనిపక్షంలో ఆందోళనకు మరింత ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## లోహారిబందలో పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు

- నేత్ర దానంపై అవగాహన సదస్సు




**మందస, సెప్టెంబరు 1(వార్త):** మందస మండలంలో మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఉద్దాన ప్రాంతమైన లోహారిబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా, జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంఘం చైర్మన్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు ప్రకారం పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. 105మంది విద్యార్థులకు మందస మండల నేత్ర వైద్య సహాయ అధికారి రోణంకి వెంకటరమణ కంటి పరీక్షలు నిర్వహించారు. 18మందికి దృష్టిలోపం ఉన్నట్టు గుర్తించి కళ్ల అద్దాలకు సిఫార్సు చేశారు. నేత్ర దానంపై విద్యార్థులు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. ఒక్కరి నేత్రధానము ఇద్దరికీ చూపునిస్తుందని ప్రధానోపాధ్యాయుడు ఎం.చక్రపాణి వివరించారు. నేత్ర దానంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్ చార్జి ఉపాధ్యాయుడు ఎం.చక్రపాణి, మెడికల్ సిబ్బంది నవ్యశ్రీ, ఆశ, పార్వతి, జానకి, ఉపాధ్యాయులు రాజేష్, వెంకటేశ్వరరావు, గిరిధరరావు, శేఖర్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పల్లెలు ప్రశాంతతకు నిలయాలు కావాలి

- మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్

**మందస, సెప్టెంబరు 1(వార్త):** పల్లెలు ప్రశాంతతకు నిలయాలు కావాలని మందస ఎస్ఐ కూటికుప్పల కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మందస మండలంలోని పిడిమందస గ్రామంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికలు రానున్నాయని, ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఉండాలన్నారు. వివాదాలు, గొడవలు పడవద్దని హితవు పలికారు. గ్రామాల్లో శాంతి భద్రతల రక్షణ పోలీసు ధ్యేయమని, ప్రజలు సహకారంతో సాధ్యపడుతుందన్నారు. స్థానిక ఎన్నికల హడావుడి ప్రారంభమైందని, పల్లెల్లో ప్రశాంత వాతావరణం కూడా ఉండాలన్నారు. ప్రజలను చట్టాలను గౌరవించాలని కోరారు. ప్రస్తుతం చట్టాలు కఠినంగా ఉన్నాయని, నేరాలకు పాల్పడితే చర్యలు కూడా కఠినంగానే ఉంటాయన్నారు. రాజకీయ గొడవలు, వివాదాల రహిత గ్రామాలే లక్ష్యం కావాలని, ఇందు కోసం పోలీసులు ఎంతో ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు కూడా తమతో పాటు కలసిరావాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో కక్షలు, కార్పణ్యాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలు, సైబర్ నేరాల నివారణ, నూతన క్రిమినల్ చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు. అదేవిధంగా మహిళా ఏఎస్ఐ వరలక్ష్మి, హెడకానిస్టేబుల్స్ రామారావు, షణ్ముఖరావు, చిన్నారావు, సీతారాం, వాసుదేవు వారి దత్తత గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు.



## గ్రామ శ్రేయస్సు స్థితిస్థాపక ప్రణాళికపై శిక్షణ



**వజ్రపుకొత్తూరు/మందస, సెప్టెంబరు 1(వార్త):** గ్రామ శ్రేయస్సు స్థితిస్థాపక ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం డీఆర్ డీఏ వెలుగు ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగింది. వజ్రపుకొత్తూరు మండల మహిళా సమాఖ్య కార్యలయంలో ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వి.పి.ఆర్.పి(విలేజ్ ప్రాస్పెర్టీ రెసిలియన్స్ ప్లాన్) అనగా గ్రామ శ్రేయస్సు స్థితిస్థాపక ప్రణాళికపై వీఓఏలకు, గ్రామసంఘం అధ్యక్షులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో ఏపీఎం గొడబ ప్రసాదరావు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో విపిఆర్పి ముఖ్య అంశాలైన హక్కుల ప్రణాళిక, జీవనోపాదుల ప్రణాళిక, ప్రజా వస్తువులు, సేవలు, వనరుల ప్రణాళిక, సామాజిక అభివృద్ధి ప్రణాళిక ప్రకారం గ్రామస్థాయిలో గుర్తించి, గ్రామ సభలలో ఆమోదించుకునేటట్లు చేసుకోవాలని వీఓఏలకు వివరించారు. ధ

కార్యక్రమంలో ఏపీఎం గొడబ ప్రసాదరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, కోశాధికారి చంద్రకళ, సీసీలు రేణుక, నీలవేణి, హరిప్రియ, వెంకటేశ్వర్లు, అకౌంటెంట్ మీనా, వీఓఏలు పాల్గొన్నారు.

## హైకోర్టు ఆదేశాలతో మహిళకు పింఛన్ అందజేత

- 12 నెలల బకాయిల చెల్లింపు



**నరసన్నపేట, సెప్టెంబరు 1 (వార్త):** హైకోర్టు ఆదేశాల మేరకు ఓ మహిళకు పింఛన్ బకాయిలతో పాటు ప్రస్తుత నెల పింఛన్‌ను సచివాలయ సిబ్బంది అందజేసిన ఘటన నరసన్నపేట మండలం రావులవలసలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నరసింహులు నవంబర్ 2023లో మృతి చెందారు. ఆయన భార్య లక్ష్మీకి నిబంధనల ప్రకారం స్పౌజ్ కేటగిరీలో 2025 జూలై నుంచి పింఛన్ మంజూరైంది. అయితే స్థానికంగా నెలకొన్న రాజకీయ విభేదాల కారణంగా తనకు మంజూరైన పింఛన్‌ను నిలిపివేశారని ఆరోపిస్తూ లక్ష్మీ హైకోర్టును ఆశ్రయించారు. తనకు రావాల్సిన పింఛన్ అందకపోవడంతో ఎదురైన ఇబ్బందులను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశాన్ని పరిశీలించిన హైకోర్టు ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టారు. కోర్టు ఆదేశాల ప్రకారం గతంలో నిలిచిపోయిన 12 నెలల పింఛన్ బకాయిలతో పాటు ఆగస్టు నెల పింఛన్‌ను లక్ష్మీకి సచివాలయ సిబ్బంది అందజేశారు. దీంతో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పింఛన్ సమస్యకు పరిష్కారం లభించింది. హైకోర్టు ఆదేశాల మేరకు బకాయిలు చెల్లించడంతో బాధితురాలికి కొంత ఊరట లభించింది. ప్రభుత్వ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందాల్సిన ప్రయోజనాలు ఎలాంటి కారణాలతోనూ నిలిచిపోకుండా అధికారులు పర్యవేక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## సాయి కమ్యూనికేషన్స్ అధినేత కోటేశ్వరచౌదరి కన్నుమూత

- తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ధ మంత్రి అచ్చెన్నాయుడు, ప్రముఖులు



**శ్రీకాకుళం, సెప్టెంబరు 1(వార్త):** సాయి కమ్యూనికేషన్స్ అధినేత, జీ కమ్యూనికేషన్స్ నిర్మాత, నవ్యాంధ్ర సొండి కుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నెమలిపురి కోటేశ్వర చౌదరి (83) మంగళవారం వృద్ధాప్య సమస్యలతో కన్నుమూశారు. శ్రీకాకుళం నగరంలోని అఫీషియల్ కాలనీ రోడ్డులో నివాసముంటున్న ఆయన గత రెండురోజులుగా అస్వస్థతతో బాధపడుతూ, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి వార్త తెలిసి సొండి కుల సంఘాల ప్రతినిధులు, మీడియా రంగానికి చెందిన ప్రముఖులు, జిల్లా నాయకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.

### మరణంలోనూ సార్థకత:

జీవితాంతం సమాజ సేవలోనే గడిపిన కోటేశ్వర చౌదరి, మరణంలోనూ మరొకరికి వెలుగులు నింపి ఆదర్శంగా నిలిచారు. ఆయన భౌతికకాయం నుంచి నేత్రాలను దానం చేసేందుకు కుమారుడు జీవన్, ఇతర కుటుంబ సభ్యులు అంగీకరించి, ముందుకు వచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు కార్నియాలను సేకరించారు.

### కేబుల్ రంగంలో ముద్ర..

### కుల సంక్షేమానికి అంకితం

నగరంలో జీ టెలివిజన్ లోకల్ కేబుల్ నెట్‌వర్క్‌ను ప్రారంభించి ప్రసార మాధ్యమ రంగంలో తనదైన శైలిలో రాణించిన కోటేశ్వర చౌదరి, సమాంతరంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. జిల్లాలో తొలిసారి బ్రాడ్ బాండ్ సేవలను పరిచయం చేసింది కూడా చౌదరే. సొండి కుల హక్కుల పరిరక్షణ కోసం ఆయన కొన్ని దశాబ్దాలుగా విరామం లేకుండా పోరాడుతూనే ఉన్నారు. సొండి కులస్తులను 'బీసీ-డీ' జాబితాలో చేర్పించడమే ధ్యేయంగా విశేష కృషి చేశారు. జాతీయ స్థాయిలో ఓబీసీ సాధన కోసం ఇటీవల కాలంలోనే ఢిల్లీ వెళ్లి పలువురు కేంద్ర మంత్రులను సైతం కలసి వినతిపత్రాలు అందజేశారు.

### అరసవిల్లి క్షేత్రానికి విశేష సేవలు:

ఆధ్యాత్మిక రంగంలోనూ కోటేశ్వర చౌదరి తనదైన ముద్ర వేశారు. ప్రసిద్ధ అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి (ట్రస్ట్ బోర్డు) సభ్యుడిగా సేవలందించారు. సూర్యభగవానుని ఆలయంలో నవగ్రహాల ప్రతిష్ఠాపనకు శ్రీకారం చుట్టడమే కాకుండా, స్వామివారి కైంకర్యాల కోసం 102 వెండి పువ్వులను తన సొంత ఖర్చులతో ప్రత్యేకంగా తయారు చేయించారు. అంతటితో ఆగకుండా తన సొంత నిధులతో స్వామివారికి ఎంతో విలువైన బంగారు ఆభరణాలను కూడా సమర్పించి తన భక్తిప్రపత్తులను చాటుకున్నారు. అరసవెల్లికి ప్రత్యేకంగా వెబ్సైట్ తయారు చేసి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులు మీదుగా దానిని రెండు దశాబ్దాల క్రితమే ప్రారంభించారు.

### మంత్రి అచ్చెన్నాయుడు నివాళులు:

కోటేశ్వర చౌదరి మృతిపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర సంతాపం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సొండి కార్పొరేషన్ ఛైర్మన్‌గా జిల్లా నుంచి ఆయన పేరును ప్రతిపాదించి ప్రభుత్వానికి పంపించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో, ఆయన హఠాన్మరణం చెందడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నెమలిపురి కోటేశ్వర చౌదరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా.. ఇద్దరు కుమారులు గతంలోనే మృతి చెందారు. వయోభారంతో పాటు కుమారులు కోల్పోయిన తీరని లోటు ఉన్నప్పటికీ, ఆయన చివరి వరకు సమాజ సేవలోనే గడిపారు. ఆయన భౌతికకాయానికి పలువురు జిల్లా ప్రముఖులు, వివిధ కమ్యూనికేషన్ల సంస్థల ప్రతినిధులు, శ్రీ నవ్యాంధ్ర సొండి కుల సంక్షేమ సంఘం ప్రతినిధులు నివాళులర్పించి సంతాపాన్ని ప్రకటించారు.

## కోదడ్డపనస అయ్యప్ప ఆలయంలో 30 అడుగుల ఏకశిలా ధ్వజస్తంభం

- మూడు క్రేన్ల సహాయంతో ఏకశిలా ధ్వజస్తంభం ఏర్పాటు
- కోట్లాది రూపాయలతో కొనసాగుతున్న ఆలయ నిర్మాణ పనులు
- అనంతరం భక్తులకు అన్నసమారాధన




**సారవకోట, సెప్టెంబరు 1 (వార్త):** కోదడ్డపనస గ్రామంలోని శ్రీ స్వయంభూ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం 30 అడుగుల ఏకశిలా ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రత్యేకంగా తీసుకువచ్చిన ఈ భారీ ఏకశిలా ధ్వజస్తంభాన్ని శాస్త్రోక్తంగా ఏర్పాటు చేయడంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కోదడ్డపనస గ్రామంలోని కొండపై శ్రీ స్వయంభూ అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణ పనులు కోట్లాది రూపాయల వ్యయంతో కొనసాగుతున్నాయి. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించే దిశగా పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే ఆలయ ప్రాంగణంలో 30 అడుగుల పొడవైన ఏకశిలా ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేశారు. ధ్వజస్తంభం భారీగా ఉండటంతో సాధారణ పద్ధతిలో ఏర్పాటు చేయడం సాధ్యం కాకపోవడంతో మూడు క్రేన్లను వినియోగించారు. క్రేన్ల సహాయంతో ధ్వజస్తంభాన్ని జాగ్రత్తగా పైకి ఎత్తి నిర్ణీత ప్రదేశంలో ప్రతిష్ఠించారు. ఈ ప్రక్రియను చూసేందుకు భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ధ్వజస్తంభం ఏర్పాటు అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతుండటంతో రానున్న రోజుల్లో ఈ ప్రాంతం మరింత ఆధ్యాత్మిక ప్రాధాన్యం సంతరించుకోనుందని స్థానికులు తెలిపారు.

## నేత్రదానంతో పలువురికి చూపు

**సారవకోట, సెప్టెంబరు 1 (వార్త):** నేత్రదానం ద్వారా చూపు కోల్పోయిన పలువురికి కంటి చూపు ప్రసాదించవచ్చని సారవకోట పీహెచ్‌సీ కంటి వైద్యులు ప్రసాద్ తెలిపారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సారవకోట గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు ప్రసాద్ మాట్లాడుతూ.. ఒక వ్యక్తి మరణించిన తర్వాత కూడా కొంతకాలం నేత్రాలు దానానికి ఉపయోగపడతాయని తెలిపారు. మరణించిన వ్యక్తి నేత్రాలను సకాలంలో సేకరించి అవసరమైన వారికి కంటి చూపు కల్పించేందుకు వినియోగించవచ్చని వివరించారు. తద్వారా ఒకరి మరణం తర్వాత కూడా మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం ఉంటుందని విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడంతో పాటు, దాని ప్రాధాన్యాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని సూచించారు. మరణం సంభవించిన వెంటనే నేత్రదానానికి సంబంధించిన సమాచారాన్ని వైద్య సిబ్బందికి అందించి, వీలైనంత త్వరగా నేత్రదానం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు నేత్రదానం ప్రాముఖ్యతను తెలుసుకుని, ఈ విషయాన్ని తమ కుటుంబ సభ్యులు, పరిచయస్తులకు కూడా తెలియజేయాలని వైద్యులు సూచించారు. నేత్రదానంపై అవగాహన పెంపొందించడం ద్వారా మరింత మంది దాతలు ముందుకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.



## భక్తికి బాబా చేయూత

- కాపు వీధి వినాయక ఉత్సవ కమిటీకి రూ.5 వేలు అందజేసిన దువ్వాడ శ్రీధర్

**పలాస, సెప్టెంబరు 1 (వార్త):** పలాసలోని కాపు వీధిలో వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఉత్సవాలకు దువ్వాడ శ్రీధర్ (బాబా) తనవంతు సహకారం అందించారు. ఉత్సవ కమిటీ పెద్దలను కలిసి రూ.5 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ (బాబా) మాట్లాడుతూ విఘ్నేశ్వరుడి ఆశీస్సులు పలాస నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, సుఖసంతోషాలతో వినాయక చవితి వేడుకలను జరుపుకోవాలని కోరారు. నియోజకవర్గ ప్రజలందరికీ ముందస్తుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక యువకులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

ప్రపంచ మార్కెట్‌లో..

-ఎగుమతులకు ప్రోత్సాహం -నాణ్యత, ప్యాకేజింగ్, ఎగుమతి ప్రమాణాలపై అవగాహన పెంచుకోవాలి - ఎమ్మెల్యే శిరీష

# పలాస జీడిపప్పుకు ప్రత్యేక గుర్తింపు



**పలాస, సెప్టెంబరు 1(వార్త):** పలాస జీడిపప్పుకు దేశీయ మార్కెట్‌తో పాటు అంతర్జాతీయ విపణిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడమే లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. జీడిపప్పు పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఎగుమతులకు ప్రోత్సాహం, నాణ్యత ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. జీడిపప్పు పరిశ్రమపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్న నేపథ్యంలో ఈ రంగాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏపిఈడిఏ ఆధ్వర్యంలో నిర్వహించిన జీడిపప్పు వర్క్‌షాప్, ఎగుమతులపై అవగాహన సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జీడిపప్పు పరిశ్రమకు సంబంధించిన పలు అంశాలపై నిర్వాహకులు, పరిశ్రమ ప్రతినిధులతో చర్చించారు.

ఎగుమతులకు అపార అవకాశాలు ఉన్నాయని, పలాస ప్రాంతంలో జీడిపప్పు పరిశ్రమకు దశాబ్దాల చరిత్ర ఉందని ఎమ్మెల్యే తెలిపారు. జీడిపప్పు ఉత్పత్తి, ప్రాసెసింగ్, వ్యాపారం, రవాణా తదితర రంగాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పెద్ద సంఖ్యలో ప్రజలకు ఉపాధి లభిస్తోందన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక పరిశ్రమలు నాణ్యతతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రాసెసింగ్ నాణ్యత, ప్యాకేజింగ్, నిల్వ విధానాలు, ఆహార భద్రతా ప్రమాణాలు, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలు, ఎగుమతి విధానాలపై పరిశ్రమ వర్గాలకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు నాణ్యమైన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు అందించగలిగితే పలాస జీడిపప్పుకు మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉందని ఆమె తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేసేందుకు చొరవ చూపాలని, జీడిపప్పు వ్యాపారులు, ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులు, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని గౌతు శిరీష హామీ ఇచ్చారు. పరిశ్రమకు అవసరమైన ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఎగుమతి అవకాశాలను స్థానిక పరిశ్రమలకు చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. పలాస జీడిపప్పుకు అంతర్జాతీయ స్థాయిలో బ్రాండ్ విలువ పెంచడం ద్వారా వ్యాపార విస్తరణకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. ఎగుమతులు పెరిగితే పరిశ్రమల ఉత్పత్తి సామర్థ్యం పెరగడంతో పాటు స్థానికంగా మరిన్ని ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని వివరించారు.

## పరిశ్రమకు దిశానిర్దేశం

సదస్సులో ఏపీఈడీఏ అధికారులు జీడిపప్పు ఎగుమతులకు సంబంధించిన విధానాలు, నాణ్యత ప్రమాణాలు, అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న అవకాశాలు, ఎగుమతిదారులు పాటించాల్సిన నిబంధనలపై వివరించారు. జీడిపప్పు పరిశ్రమ ప్రతినిధులు తమకు ఎదురవుతున్న సమస్యలు, ఎగుమతుల సమయంలో ఎదురయ్యే సవాళ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

పలాసలో ఇప్పటికే బలంగా ఉన్న జీడిపప్పు పరిశ్రమను ఎగుమతి ఆధారిత పరిశ్రమగా మరింత అభివృద్ధి చేస్తే ఈ ప్రాంతానికి అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక స్థానం లభించే అవకాశం ఉందని సదస్సులో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రైతు నుంచి ప్రాసెసింగ్ యూనిట్, అక్కడి నుంచి ఎగుమతి మార్కెట్ వరకు మొత్తం విలువ ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రతినిధులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, ఏపీఈడీఏ అసిస్టెంట్ మేనేజర్ విజయ్ బాలాజీ (విశాఖ), ఆర్.పీ.నాయుడు, మల్ల కాంతారావు, మల్ల రామేశ్వరరావు, డీహెచ్‌వో చంద్రశేఖరరావు, శాసనపూరి మురళి, మల్ల సంతోష్, రవిశంకర్ గుప్తా, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ అధికారులు, జీడిపప్పు పరిశ్రమ ప్రతినిధులు, వ్యాపారులు, ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వాహకులు, వివిధ కంపెనీల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల సమస్యలపై పోలీసులకు సమాచారమివ్వాలి



**పోలాకి, సెప్టెంబరు 1 (వార్త):** గ్రామాల్లో శాంతిభద్రతలకు సంబంధించిన ఎటువంటి సమస్యలు తలెత్తినా ప్రజలు వెంటనే పోలీసు శాఖకు సమాచారం అందించాలని సీఐ ఎం. శ్రీనివాసరావు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం రాత్రి పోలాకి మండలంలో నిర్వహించిన మెగా పల్లెనిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు భద్రతా పరమైన ఇబ్బందులు ఎదురుకాకుండా పోలీసు శాఖ నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తోందని సీఐ తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పద పరిణామాలు, వ్యక్తుల కదలికలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలు గుర్తించినప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా మహిళలు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు గుర్తించినా, వారి కదలికలపై ఏమైనా అనుమానాలు ఉన్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటం ద్వారా నేరాలను ముందుగానే నివారించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మెగా పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు భద్రతపై అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశమని సీఐ తెలిపారు. పోలీసు శాఖకు ప్రజలు సహకరిస్తూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

## నియోజకవర్గంలో బీజేపీకి పెరుగుతున్న ఆదరణ



**నరసన్నపేట, సెప్టెంబరు 1 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీకి ప్రజాదరణ క్రమంగా పెరుగుతోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోకతోట సింహాచలం అన్నారు. పార్టీ విధానాలు, సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై వివిధ వర్గాలకు చెందిన పలువురు బీజేపీ వైపు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. కొత్త రేవు పంచాయతీకి చెందిన వైసీపీ సానుభూతిపరులు అచ్యుతరావు, సురేశ్‌తో పాటు మరికొందరు బీజేపీలో చేరారు. పార్టీ సిద్ధాంతాలు, విధానాలు నచ్చడంతోనే తాము బీజేపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా పోకతోట సింహాచలం వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని సింహాచలం తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి పార్టీ తరపున నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మరిన్ని చేరికలు ఉంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## యారబాడులో భూ వివాదంపై ఆరోపణలు

**నరసన్నపేట, సెప్టెంబరు 1 (వార్త):** యారబాడు పంచాయతీ రెవెన్యూ పరిధిలోని భూమి విషయంలో రాజకీయ వివాదం నెలకొంది. తనపై టీడీపీ నేత రమణ తప్పుడు ఫిర్యాదు చేశారని వైసీపీ మండల అధ్యక్షుడు లుకలాపు రవికుమార్ ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజకీయ కక్షలతో అధికార పార్టీ నేతలు తనను, తమ వర్గానికి చెందిన వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. యారబాడు గ్రామంలో ఎన్ని రాజులమ్మ, వేణునాయుడుకు సంబంధించిన జిరాయతీ ఆస్తి విషయంలో స్థానిక నాయకుల ఫిర్యాదుల ఆధారంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని రవికుమార్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఒత్తిడి కారణంగా రెవెన్యూ అధికారులు తనను వేధిస్తున్నారని ఆరోపించారు. తప్పుడు ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకునే ముందు అధికారులు క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించాలని ఆయన కోరారు. మరోవైపు యారబాడు గ్రామంలోని పోరంబోకు స్థలంలో నిర్మించిన గోడను తొలగించనున్నట్లు తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. పోరంబోకు భూముల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని సంబంధితులకు ముందుగానే సూచించినట్లు చెప్పారు. ఆక్రమణలను తొలగించాలని కూడా పలుమార్లు తెలియజేసినట్లు వివరించారు. ఈ వ్యవహారంలో ఎలాంటి రాజకీయ ఒత్తిడి లేదని తహశీల్దార్ స్పష్టం చేశారు. స్థానికుల నుంచి అందిన ఫిర్యాదు మేరకే రెవెన్యూ అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. భూముల విషయంలో నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తామని, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వైసీపీ నేత ఆరోపణలు, రెవెన్యూ అధికారుల వివరణలతో యారబాడు భూ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. భూమికి సంబంధించిన వాస్తవాలను పూర్తిస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.







## ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి

**- జిల్లా వ్యవసాయధికారి మురళీకృష్ణ**



**మెళియాపుట్టి, సెప్టెంబరు 1(వార్త):** నీటి వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాలలో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల వైపు మొగ్గు జిల్లా వ్యవసాయ అధికారి వై వి మురళీకృష్ణ అన్నారు. మెళియాపుట్టి మండలంలో పద్ద, చిన్న సున్నాపురం తదితర గ్రామంలో వరి వేదజల్లిన పంట పొలాలను జిల్లా వ్యవసాయధికారి మురళీకృష్ణ, పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు వై. శారదలు మంగళవారం నాడు పరిశీలించి రైతులతో మాట్లాడుతూ నీటి సదుపాయము తక్కువ ఉన్నచోట ఆరుతడి పంటలు పండించుకోవాలని, నీటి వనరులు తక్కువగా ఉన్నచోట ఆరుతడి పంటల సాగు కొరకు విత్తనాల కోసం తమకున్న సమీప గ్రామ వ్యవసాయ సహాయకులకు, మండల వ్యవసాయాధికారికి ప్రత్యామ్నాయ ప్లాన్ కింద ఆరుతడి పంటలు విత్తనాలకు ఇండెంట్ ఇవ్వాలని, ప్రస్తుతం ఎలినీనో ప్రభావం ఉన్న ఈ పరిస్థితుల్లో ప్రభుత్వము నుండి రాయితీపైన ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. ఇది ప్రతి ఒక్క రైతు కూడా గమనించి ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అవసరం ఉన్న రైతులు ఆర్ వి కె కేంద్రాలకు సందర్శించాలని, అలాగే గ్రామ వ్యవసాయ, ఉద్యాన వన సహాయకులు ఈ విషయం పైన రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. మండలం కేంద్రంలోనున్న రైతు సేవ కేంద్రంలో ఇన్చార్జిలతో జిల్లా వ్యవసాయధికారి, పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల పై సమీక్షించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన వన సహాయకులు పంట నమోదును సెప్టెంబర్ 15వ తేదీలోపు పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే రైతు రిజిస్ట్రేషన్, ఏపీ ఏఐఎంఎస్ యాప్లో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని ఆన్లైన్లో అప్డేట్ చేయాలని ఆదేశించారు. ప్రతి రైతుసేవ కేంద్ర ఇన్చార్జి ప్రస్తుతమున్న పరిస్థితుల్లో రైతులకు విధిగా అందుబాటులో ఉండి ఏలినినోపైన సరైన అవగాహన కల్పించి సరైన చర్యలు తీసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు వై. శారద, మండల వ్యవసాయధికారి ఎస్. దానకర్ణుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు, పలువురూ రైతులు తదితరులున్నారు.

## ప్రశాంత వాతావరణానికి గ్రామస్థులు కృషి చేయాలి



**నరసన్నపేట, సెప్టెంబరు 1 (వార్త):** గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా గ్రామస్థులు పరస్పర ఐకమత్యంతో మెలగాలని ఎస్సై బి. గణేశ్ సూచించారు. నరసన్నపేట మండలం నడగాంలో సోమవారం రాత్రి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించిన పల్లెనిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై ఎస్సై ఆరా తీశారు. గ్రామస్థుల మధ్య ఎలాంటి విభేదాలు తలెత్తకుండా పరస్పరం సహకరించుకుంటూ సోదరభావంతో మెలగాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఏర్పడితే వాటిని ఘర్షణలకు దారితీయకుండా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్సై తెలిపారు. ఎన్నికల సమయంలో రాజకీయ విభేదాలు వ్యక్తిగత ఘర్షణలకు దారితీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంలో ఎటువంటి గొడవలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని పిలుపునిచ్చారు. పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా గ్రామస్థులతో నేరుగా మాట్లాడి శాంతిభద్రతల పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు ప్రజల్లో భద్రతపై భరోసా కల్పించేలా పోలీసులు చర్యలు చేపట్టారు. గ్రామంలో ప్రశాంతత, సామరస్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్సై గణేశ్ పేర్కొన్నారు.

## పాకెట్ మనీ పొదుపుతో... నారాయణసేవ

**-11 ఏళ్లుగా నిరంతరంగా సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు**

**- 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' సందేశంతో సేవా మార్గంలో పయనం**

**పలాస, సెప్టెంబరు 1 (వార్త):** 'అందరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అనే భగవాన్ శ్రీ సత్యసాయిబాబా దివ్య సందేశాన్ని ఆచరణలో పెడుతూ శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు ఆదర్శంగా నిలుస్తున్నారు. తమ రోజువారీ ఖర్చుల్లో కొంత మొత్తాన్ని తగ్గించుకుని, పాకెట్ మనీ నుంచి పొదుపు చేసిన నగదుతో గత 11 సంవత్సరాలుగా ప్రతి నెలా ఒకటో తేదీన నారాయణసేవ నిర్వహిస్తున్నారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా బోధించిన 'సెయిలింగ్ ఆన్ డెసిరీస్ (కోడ్)' సిద్ధాంతాన్ని పాటిస్తూ అవసరాలను నియంత్రించుకోవడం ద్వారా ఆదా చేసిన మొత్తాన్ని సమాజ సేవకు వినియోగిస్తున్నారు. చిన్న వయసులోనే పొదుపు, సేవ, సామాజిక బాధ్యత వంటి విలువలను అలవర్చుకోవడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలుస్తోంది. ఈ క్రమంలో సెప్టెంబరు 1న శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు షిర్డీసాయి మందిరం పరిసరాల్లోని నారాయణులకు ఆహార ప్రసాదాన్ని అందించారు. దీంతోపాటు స్వామివారి విభూతి, స్వామివారి చిత్రపటాలను అందజేశారు. ఆహారాన్ని అందించడమే కాకుండా ఆప్యాయతతో పలకరించి సేవాభావాన్ని చాటారు.




### 11 ఏళ్లుగా... సేవా పరంపర

విద్యార్థులు తమ పాకెట్ మనీలో కొంత భాగాన్ని క్రమం తప్పకుండా పొదుపు చేసి, అదే మొత్తాన్ని ప్రతి నెలా నారాయణసేవకు వినియోగిస్తున్నారు. ఒకరోజు కార్యక్రమంగా కాకుండా 11 సంవత్సరాలుగా నిరంతరంగా కొనసాగుతున్న సేవా కార్యక్రమం కావడం విశేషం. విద్యతో పాటు మానవతా విలువలను విద్యార్థుల్లో పెంపొందించాలనే లక్ష్యంతో ఈ సేవా పరంపర కొనసాగిస్తున్నారు. విద్యతో పాటు విలువల బోధన చేస్తూ పిల్లల్లో చిన్ననాటి నుంచే 'అవసరం--కోరిక' మధ్య తేడాను గుర్తించేలా చేయడం, వృథా ఖర్చులను తగ్గించుకోవడం, పొదుపు చేసిన మొత్తాన్ని అవసరమైన వారికి ఉపయోగపడేలా చేయడం ద్వారా సేవా భావనను పెంపొందిస్తున్నారు. తద్వారా విద్యార్థుల్లో సమాజం పట్ల బాధ్యత, ఇతరుల పట్ల కరుణ, సహాయం చేసే మనస్తత్వం పెరుగుతున్నాయని శ్రీ సత్య సాయి విద్య విహార్ ట్రస్ట్ చైర్మన్ మల్లారామేశం తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో నారాయణసేవ ఇన్‌చార్జి దాలేటి సార్, శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## తీరనున్న రత్తకన్న ఎల్‌సీ గేటు కష్టాలు!

**- ఎట్టకేలకు అండర్ పాసేజీ పనులు ఆరంభం**



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 1 (వార్త):** ఎట్టకేలకు రత్తకన్న ఎల్‌సీ గేటు అండర్ పాసేజీ పనులు ప్రారంభించారు. రూ2.06 కోట్లతో రైల్వే రైల్వే అండర్ బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. ఇటీవలే రత్తకన్న గేటుతో నరకయాతన అనే శీర్షికన కథనం వెలువడిన సంగతి తెలిసిందే. సౌత్ కోస్ట్ రైల్వే అధికారులు స్పందించి సంబంధింత కాంట్రాక్టర్‌తో పనులు యుద్ధప్రాతిపదికన ఆరంభించారు. ప్రస్తుతం ఎర్త్ వర్క్ పనులు మొదలు పెట్టారు. ఎక్స్‌కవేటర్ సాయంతో ముళ్ల పొదలు తొలగించి చదును చేస్తున్నారు. ఈ పనులను జెడ్‌ఆర్‌యూ సీసీ సభ్యులు శ్రీనివాస్ రౌలో (రంగా) పర్యవేక్షణలో చేపట్టారు. ఈ పనులను జనసేన నాయకులు దాసరి రాజు, తెలుగుదేశం నాయకులు కాళ్ల ధర్మారావు, కాళ్ల జయదేవ్, కాళ్ల గోపి, కరగాన కృష్ణ, బీజేపీ నాయకులు ధనుష్ రంగా, చంద్రశేఖర్, యువసూర్య ప్రతినిధి ఎం.రాంబాబు, కాళ్ల దేవరాజ్ తదితరులు వీక్షించారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

**- కాశీబుగ్గ రూరల్ సీఐ ఎం.తిరుపతిరావు**



**మందస, సెప్టెంబరు 1(వార్త):** శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కాశీబుగ్గరూరల్ సీఐ ఎం.తిరుపతిరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన సువర్ణాపురంలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ తిరుపతిరావు మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతల రక్షణ పోలీసు ధ్యేయమని, ప్రజలు సహాకారంతో సాధ్యపడుతుందన్నారు. స్థానిక ఎన్నికల హడావుడి ప్రారంభమైందని, పల్లెల్లో ప్రశాంత వాతావరణం కూడా ఉండాలన్నారు. ప్రజలను చట్టాలను గౌరవించాలని కోరారు. ప్రస్తుతం చట్టాలు కఠినంగా ఉన్నాయని, నేరాలకు పాల్పడితే చర్యలు కూడా కఠినంగానే ఉంటాయన్నారు. రాజకీయ గొడవలు, వివాదాల రహిత గ్రామాలే లక్ష్యం కావాలని, ఇందు కోసం పోలీసులు ఎంతో ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు కూడా తమతో పాటు కలసిరావాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో కక్షలు, కార్పణ్యాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు. అదేవిధంగా మహిళా ఏఎస్ఐ వరలక్ష్మి, హెడకానిస్టేబుల్స్ రామారావు, షణ్ముఖరావు, చిన్నారావు, సీతారాం, వాసుదేవు వారి దత్తత గ్రామాల్లో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు.

## సాహితీ సేవలకు 'ఉరసం' సత్కారం

**- డాక్టర్ కుమార్ నాయక్‌కు ఘన సన్మానం**

**- తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అభినందనలు**

**పలాస, సెప్టెంబరు 1 (వార్త):** సాహితీ రంగానికి విశేష సేవలందిస్తూ, కవులు--రచయితలను ప్రోత్సహిస్తూ, పుస్తకాల ముద్రణకు సహకరిస్తున్న డాక్టర్ కుమార్ నాయక్‌ను ఉద్దానం రచయితల వేదిక (ఉరసం) ఘనంగా సత్కరించింది. గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక గురుకుల పాఠశాల ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఉరసం అధ్యక్షుడు కుత్తుం వినోద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు, రచయితలు పాల్గొని తెలుగు భాషా వికాసానికి గిడుగు రామమూర్తి చేసిన సేవలను స్మరించుకున్నారు. తెలుగు భాషను ప్రజలకు మరింత చేరువ చేయడంలో గిడుగు రామమూర్తి పోషించిన కీలక పాత్రను వక్తలు వివరించారు.

### సాహిత్య ప్రోత్సాహానికి గుర్తింపుగా..

కవులను సత్కరించడం, కొత్తగా రచనలు చేస్తున్న వారిని ప్రోత్సహించడం, సాహిత్య కార్యక్రమాలకు అండగా నిలవడం, పుస్తక ప్రచురణకు సహకరించడం వంటి కార్యక్రమాల ద్వారా కుమార్ నాయక్ సాహితీ రంగానికి తనదైన రీతిలో సేవలందిస్తున్నారని వక్తలు తెలిపారు. సాహిత్యానికి సేవ చేస్తున్న వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా మరింత మంది రచయితలకు స్ఫూర్తి కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కుమార్ నాయక్‌ను శాలువా కప్పి, ప్రశంసాపత్రం, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఆయన సాహితీ సేవలను అభినందిస్తూ పలువురు కవులు, సాహితీవేత్తలు శుభాకాంక్షలు తెలిపారు. గిడుగు రామమూర్తి జీవిత చరిత్ర, ఆయన తెలుగు భాష కోసం చేసిన కృషి, వ్యావహారిక భాషా ఉద్యమానికి అందించిన సేవలను వివరించారు. తెలుగు భాషను ప్రజల నిత్యజీవితానికి మరింత చేరువ చేసిన మహనీయుడి జయంతిని స్మరించుకుంటూ సాహిత్య కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. భాషాభిమానులు, సాహితీవేత్తలు, కవులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో సిజాస్ సంస్థకు చెందిన మామిడి కృష్ణారావు, రాపాక ధనరాజు, గోరకల లోకేశ్వరరావు, కవిశ్రేష్ఠులు బొమ్మిడి సుబ్బారావు, తెప్పల కృష్ణమూర్తి, కోనేరు ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## -అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టాం

## - ఎమ్మెల్యే గౌతు శిరీష

**పలాస, సెప్టెంబరు 1(వార్త):** పేదలు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం 24వ వార్డులో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఆత్మగౌరవానికి భరోసా కల్పించే దిశగా ప్రయత్నం చేస్తున్నామని,

వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న పింఛన్ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వారి జీవనానికి భరోసాతో పాటు ఆత్మగౌరవాన్ని కల్పించే చర్య అని ఎమ్మెల్యే అన్నారు. నెలనెలా అందే పింఛన్ ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తమ వ్యక్తిగత అవసరాలకు ఇతరులపై ఆధారపడకుండా కొంతవరకు స్వతంత్రంగా జీవించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు.

### అర్హతే ప్రామాణికంగా చేసుకొని,

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికీ చేరేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా అర్హతను ప్రామాణికంగా తీసుకుని పథకాల ప్రయోజనాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.

### సమన్వయంతో అమలు చేస్తూ

పలాస నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని గౌతు శిరీష తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరినప్పుడే వాటి ఉద్దేశ్యం నెరవేరుతుందని అన్నారు.

పింఛన్లు సామాజిక భద్రతా వ్యవస్థలో కీలక భాగంగా మారడంతో ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు వంటి వర్గాలకు క్రమం తప్పకుండా అందే ఆర్థిక సాయం కుటుంబ అవసరాలను తీర్చుకోవడంలో తోడ్పడుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాలను కేవలం నగదు పంపిణీగా కాకుండా లబ్ధిదారుల సమస్యలను తెలుసుకునే వేదికగా ఉపయోగించడం ద్వారా క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల అమలుపై మరింత అవగాహన కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు, పలాస ఎఎంసి చైర్మన్ మల్ల శ్రీనివాసరావు, టిడిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లోడగల కామేష్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, మున్సిపాలిటీలోని కూటమి ముఖ్య నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, వార్డు ప్రజలు, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## పోలీసుల పల్లెనిద్ర



**ఇచ్ఛాపురం, సెప్టెంబర్1 (వార్త);** ఇచ్ఛాపురం సర్కిల్ పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు .జిల్లా ఎస్ పి కే.వి మహేశ్వర రెడ్డి ఆదేశాలు మేరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ మీసాల చిన్నం నాయుడు ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం రూరల్ టౌన్ కవిటి పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లెనిద్ర చెపట్టారు.లొద్దపుట్టి తేలుకుంచి కొలిగాం కేసుపురం లలో చేపట్టారు.రానున్న స్థానిక సంస్థలు ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ లు ముకుంద రావు,జనార్దన్ రావు,రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వైఎస్సార్ వర్ధంతి

### - కాశీబుగ్గ వైఎస్సార్ స్క్వేర్‌లో నేడు కార్యక్రమం

### - మాజీ మంత్రి సీదిరి ఆధ్వర్యంలో నివాళులర్పణ



**పలాస, సెప్టెంబరు 1(వార్త):** దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని పలాస-కాశీబుగ్గ పట్టణ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నివాళు లర్పించనున్నారు. కాశీబుగ్గ వైఎస్సార్ స్క్వేర్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఉదయం 9.30 గంటలకు మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పూలమాల వేసి నివాళులర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మాజీ కౌన్సిలర్లు, పార్టీ అనుబంధ విభాగాలకు చెందిన రాష్ట్ర, జిల్లా, పట్టణ, వార్డు స్థాయి నాయకులు, డాక్టర్ సీదిరి అప్పలరాజు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు గోపీ శిష్టు కోరారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా వైఎస్సార్ రైతు కుటుంబం నుంచి ఎదిగి ప్రజా నాయకుడిగా నిలిచిన డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి పేదలు, రైతులు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టారని గోపీ శిష్టు తెలిపారు. ముఖ్యమంత్రిగా ఆయన హయాంలో రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108, 104 సేవలు, ఇందిరమ్మ ఇళ్లు, జలయజ్ఞం, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు అమలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, విద్య, వైద్య రంగాల్లో వైఎస్సార్ చేసిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ఆయన ఆశయాలు, సేవలు, త్యాగం తమకు ఎప్పటికీ ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు. "జననం ఒక యాదృచ్ఛికం.. కానీ మరణించిన తర్వాత కూడా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోవడం మహానాయకులకే సాధ్యం. వైఎస్సార్ ఆశయ సాధన కోసం మా రాజకీయ ప్రస్థానం కొనసాగుతుంది" అని గోపీ శిష్టు తెలిపారు.

## డ్రైనేజీ కోసం సంతకాల సేకరణ

### - రోడెక్కిన కంచిలి గ్రామస్తులు

### - తీవ్ర సమస్యను పట్టించుకోని పాలకులు

**కంచిలి, సెప్టెంబర్ 1(వార్త):** కంచిలి మండల కేంద్రంలో మెయిన్ రోడ్డు అభివృద్ధి నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ దశ మారలేదు. చిన్నపాటి వర్షం కురిసినా మెయిన్ రోడ్డు జలమయమై చెరువులను తలపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా కాలువల నిర్మాణం జరగకపోవడమే ప్రధాన కారణం. దీని పట్ల ఆర్ అండ్ బి అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో తీవ్ర అసంతృప్తితో విసుగెత్తిన ప్రజలు ఈ సమస్య పరిష్కారానికి చివరకు రోడ్డెక్కారు . ఈ సమస్యను ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లేందుకు మంగళవారం నుంచి స్థానిక ప్రజల సంతకాలను సేకరిస్తున్నారు. పరిస్థితి ఇంత వరకు వచ్చిందంటే అధికారుల నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. కాలువలు లేక రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోయి ప్రతి ఏటా విపరీతమైన గోతులమయమై రహదారి పరిస్థితి అత్యంత అధ్వాన్నంగా మారుతుంది. పేరుకే మండల కేంద్రం అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అంతంత మాత్రమే అనడంలో సందేహం లేదు. దీని పట్ల అధికార పార్టీ నాయకులు కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ ను నెల రోజుల క్రితం మెయిన్ రోడ్డు పైనే కారు నిలిపి ఇప్పటికైనా దృష్టి పెట్టి కంచిలి అభివృద్ధికి కృషి చేయాలని ప్రజలు కోరారు. స్థానిక ప్రజల్లో ఈ సమస్యపై ఎమ్మెల్యే పై ఒత్తిడి వచ్చిన ప్రతిసారి ఆర్ అండ్ బి అధికారులు మొక్కుబడిగా తాత్కాలిక మరమ్మత్తులతో చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు. వ్యాపార రీత్యా, అలాగే రైల్వే స్టేషన్ ఇక్కడే ఉండడంతో కంచిలి మండల కేంద్రం చుట్టుపక్కల అనేక గ్రామాలు, మండలాల ప్రజలతో మెయిన్ రోడ్డు కిక్కిరిసిపోతుంది. ఇటువంటి మెయిన్ రోడ్డు ను ఎటువంటి సమస్యలు లేకుండా అందంగా తీర్చిదిద్దాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుందని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రతి ఎన్నికల్లోను తెలుగుదేశం పార్టీకి పట్టం కడుతున్న కంచిలి ప్రజలకు ఇటువంటి సమస్య పట్ల ప్రజా ప్రతినిధులు చిత్తశుద్ధితో పరిష్కారానికి కృషి చేయకపోవడం తమ దురదృష్టమని ప్రజలు వాపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఈ సమస్య పరిష్కారానికి సాక్షాత్తు గ్రామ ప్రజలే రోడ్డు ఎక్కడం గమనార్హం. ఇప్పటికైనా ఎమ్మెల్యే అశోక్ బాబు



# నల్ల బ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన




**పలాస, సెప్టెంబరు 1(వార్త):** ఏపీజేఏసీ పిలుపు మేరకు పలాస తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. గత కొన్ని ఏళ్లుగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిశీలించి, చర్చల ద్వారా పరిష్కరించాల్సిన అవసరం ఉందని రెవెన్యూ ఉద్యోగులు తెలిపారు. సమస్యలకు పరిష్కారం చూపాలని, ప్రభుత్వ పరిపాలనలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందించడంలో ఉద్యోగులు నిరంతరం పనిచేస్తున్నారని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు అన్నారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకుని పరిష్కరిస్తే మరింత ఉత్సాహంతో విధులు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఏపీజేఏసీ కార్యాచరణలో భాగంగా చేపట్టిన ఈ నిరసనలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ప్రభుత్వం ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చించి డిమాండ్ల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా.. బాధిత కుటుంబానికి భరోసా

### -డయాలసిస్ బాధితురాలిని పరామర్శించిన ఎమ్మెల్యే గౌతు శిరీష

### - రూ.10 వేల ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందజేత

**పలాస, సెప్టెంబరు 1(వార్త):** : కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలిచి, వారి సమస్యలను తెలుసుకుని అవసరమైన సహాయం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు పలాస మండల



తెలుగు యువత అధ్యక్షులు కిక్కిర ఢిల్లీ రావు (కెడి అర్) అన్నారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంగళవారం అందజేశారు. బొడ్డపాడు గ్రామానికి చెందిన నగిరి వీరమ్మ కిడ్నీ సంబంధిత అనారోగ్యంతో డయాలసిస్ చేయించుకుంటున్న విషయం తెలుసుకున్న ఆమె.. పలాసలోని కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు వెళ్లి పరామర్శించారు.

వీరమ్మ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ పరిస్థితులపై ఆరా తీశారు. అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న ఆమెకు ప్రభుత్వం తరఫున అందుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ.10 వేలను అందజేశారు. వైద్య చికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకుని, అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. మానవత్వమే సేవకు ప్రాతిపదికగా ఆపదలో ఉన్నవారిని పరామర్శించడం, వారి కష్టాలను తెలుసుకోవడం, అవసరమైన సమయంలో చేయూతనివ్వడం ద్వారా బాధిత కుటుంబాల్లో ధైర్యం నింపవచ్చని ఈ సందర్భంగా చెప్పారు. ప్రజా ప్రతినిధులు సంక్షేమ పథకాల అమలుతోపాటు, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. బొడ్డపాడు గ్రామ పంచాయతీ పరిధిలో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరేలా చూడాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, సంబంధిత ప్రతినిధులు పాల్గొన్నారు.

# చిరు వర్తకుల సమస్యల పరిష్కారానికి ఐక్యతే బలం

### - 25 ఏళ్లుగా చిరు వ్యాపారుల కష్టాలను చూశా

### - పట్టణ ఆర్థిక వ్యవస్థకు చిరు వ్యాపారులే వెన్నెముక

### - మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్

**పలాస, సెప్టెంబరు 1(వార్త):** పట్టణంలో చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న చిన్న వర్తకుల సమస్యలను పరిష్కరించేందుకు ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని మాజీ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. ఎండ, వానలను లెక్కచేయకుండా నిత్యం శ్రమిస్తూ పట్టణ ఆర్థిక వ్యవస్థకు చిరు వ్యాపారులు కీలకంగా నిలుస్తున్నారని తెలిపారు.

చిరు వర్తక సోదరులకు మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ స్వగృహంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా వారి జీవన పరిస్థితులు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను దగ్గరగా గమనిస్తున్నానన్నారు. రోజువారీ వ్యాపారంతోనే కుటుంబాలను నెట్టుకొస్తున్న చిన్న వ్యాపారులకు ఎదురయ్యే సమస్యలను అర్థం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సమస్యల పరిష్కారానికి సమష్టి కృషి చేస్తున్నప్పటికీ పట్టణంలో చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను వ్యక్తిగతంగా కాకుండా సమష్టిగా చర్చించి పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని శ్రీకాంత్ అభిప్రాయపడ్డారు. వ్యాపారుల మధ్య ఐక్యత, పరస్పర సహకారం ఉంటే తమ హక్కులు, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి సమర్థంగా తీసుకెళ్లవచ్చన్నారు.

చిరు వ్యాపారుల కష్టాన్ని గుర్తించి వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సౌకర్యాలు కల్పించడంతో పాటు వారి జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పట్టణ అభివృద్ధిలో భాగస్వాములైన చిన్న వ్యాపారుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. చిరు వర్తకుల శ్రమను గౌరవిస్తూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని దువ్వాడ శ్రీకాంత్ తెలిపారు. "ఐక్యతే మన అందరి బలం" అనే సందేశంతో వ్యాపారులంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారస్తుల సంఘ అధ్యక్షులు కే రమణ, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



## తొలితరం కమ్యూనిస్టు నేత రామచంద్ర మూర్తికి నివాళి



**పలాస, సెప్టెంబరు 1(వార్త):** తొలితరం కమ్యూనిస్టు నాయకుడు పెంట రామచంద్ర మూర్తి మృతికి సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ శ్రీకాకుళం జిల్లా నాయకులు నివాళులర్పించారు. ఆగస్టు 29న మృతి చెందిన రామచంద్ర మూర్తి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి సంతాపం తెలిపారు.

యువకుడిగా ఉన్న సమయంలో కాశీబుగ్గ--పలాస ప్రాంతంలో మరో 11 మందితో కలిసి కమిటీగా ఏర్పడి అఖిల భారత కిసాన్ మహాసభలు నిర్వహించారని నాయకులు గుర్తుచేశారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ యువజన మహాసభలతోపాటు అనేక సభలు, సమావేశాలు నిర్వహిస్తూ పలాసను కమ్యూనిస్టు కార్యకలాపాలకు కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారని వక్తలు తెలిపారు.

పలు ఉద్యమాలు, పోలీసు నిర్బంధాలు, సామాజిక సమస్యల కారణంగా వ్యక్తిగత జీవితాల్లో నిమగ్నమైనప్పటికీ, కమ్యూనిస్టు భావజాలాన్ని వీడకుండా తమ కుటుంబాల ద్వారా కూడా ఉద్యమాలకు సహకరించారని తెలిపారు. దశాబ్దాలుగా మందస--పలాస ప్రాంతాల్లో ప్రజా ఉద్యమాలకు, మార్క్సిస్టు భావజాలానికి సేవలందించిన రామచంద్ర మూర్తి తదితరుల వారసత్వాన్ని నేటి తరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, ఏఐసీసీటీయూ సభ్యులు కుత్తుం లోకనాథం, పిన్నింటి నాగేశ్వరరావు, పోతనపల్లి శివశంకర్, పెంట రత్నాకర్, పెంట కళ్యాణ్‌రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అండమాన్‌లో తొలిసారి తెలుగు భాషా దినోత్సవం

### మాతృభాషపై మమకారం పెంచేలా

### విద్యార్థుల ప్రసంగాలు, ప్రతిభకు ప్రోత్సాహం

### - 12 ఏళ్లుగా తెలుగు విద్యార్థుల కోసం సహోదర యువజన సంఘం విశేష కృషి

**పలాస, సెప్టెంబరు 1 (వార్త):** అండమాన్ దీవుల్లో తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు మరో ముందడుగు పడింది. తెలుగు భాషపై భావితరాల్లో మమకారం పెంపొందించడంతోపాటు విద్యార్థుల ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో సహోదర యువజన సంఘం ఆధ్వర్యంలో తొలిసారిగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దక్షిణ అండమాన్‌లోని శ్రీ విజయపురంలో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, మహిళలు, తెలుగు భాషాభిమానులు ఉత్సాహంగా హాజరయ్యారు. సహోదర యువజన సంఘం అధ్యక్షుడు కుత్తుము నీలకంఠం మార్గదర్శకత్వంలో గత 12 సంవత్సరాలుగా అండమాన్‌లోని తెలుగు విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఏటా జికె టాలెంట్ ఎక్సమినేషన్స్ నిర్వహిస్తూ విద్యార్థుల్లో సాధారణ జ్ఞానం, ప్రతిభ, పోటీతత్వాన్ని పెంపొందించేలా కృషి చేస్తున్నారు. పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేయడం ద్వారా వారి విద్యాభ్యాసానికి సంస్థ తనవంతు ప్రోత్సాహాన్ని అందిస్తోంది. విద్యార్థులు మాతృభాషను కేవలం ఒక సబ్జెక్టుగా కాకుండా నిత్యజీవితంలో వినియోగించేలా చేయాలనే ఉద్దేశంతో ఈసారి తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. 'ఏదైనా విషయాన్ని తెలుగులో స్పష్టంగా మాట్లాడాలి' అనే అంశంపై ప్రసంగ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులు తెలుగులో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయగా, స్పష్టంగా, చక్కగా మాట్లాడిన వారిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీజీటీ (కెమిస్ట్రీ) వంకల పాపారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏ భాషలో విద్యాభ్యాసం చేసినా అభ్యంతరం లేదని, అయితే ప్రతి ఒక్కరికీ తెలుగులో మాట్లాడటం తప్పనిసరిగా నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని సూచించారు. తెలుగు కేవలం మాతృభాష మాత్రమే కాదని, మన సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, ఆత్మగౌరవానికి ప్రతీక అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో ఆయన తెలుగులో ఆప్యాయంగా ముచ్చటించారు. వారి మాట్లాడే సామర్థ్యాన్ని పరిశీలిస్తూ ప్రోత్సహించారు. చక్కగా తెలుగులో మాట్లాడిన విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. తెలుగు భాషా దినోత్సవాన్ని భవిష్యత్తులో మరింత విస్తృత స్థాయిలో నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. కార్యక్రమాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి మరింత మంది విద్యార్థులు, తల్లిదండ్రులను భాగస్వాములను చేయడంతోపాటు తెలుగు భాషపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. మహిళల భాగస్వామ్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా సహోదర యువజన సంఘం ఆర్గనైజర్ ఆర్. దిలీప్‌కుమార్, టాపుబస్తీ వాస్తువులు వి. జగన్ పాల్గొన్నారు. తెలుగు భాష పరిరక్షణకు, విద్యార్థుల్లో మాతృభాషపై ఆసక్తిని పెంపొందించేందుకు సంఘం చేస్తున్న కృషిని వారు అభినందించారు. సుమారు 50 మంది విద్యార్థులు, మహిళలు, తెలుగు భాషాభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. హాజరైన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా మహిళలకు సహోదర యువజన సంఘం తరఫున నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. అండమాన్ దీవుల్లో తెలుగు మాట్లాడే కుటుంబాలు, విద్యార్థుల్లో మాతృభాషపై అనుబంధాన్ని కొనసాగించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యతోపాటు భాష, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తూ, మాతృభాషపై మమకారాన్ని పెంపొందించే దిశగా సహోదర యువజన సంఘం చేస్తున్న కృషికి అభినందనలు వెల్లువెత్తాయి. 'తెలుగు తల్లికి వందనం.. తెలుగు భాషకు అభివందనం' అంటూ కార్యక్రమం ఉత్సాహంగా ముగిసింది.




Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546